

# శిశిరం


**పిడుగు పాపిరెడ్డి**


అత్తాకోడళ్లు ఆంతరంగిక సమస్యలతో ఆగర్భ శత్రువుల్లా ఎందుకు తయారవుతారో ఎంత ఆలోచించినా రామచంద్రయ్యకు అర్ధమయ్యేది కాదు. పుట్టింట్లో పావు జీవితం గడిపితే ముప్పావు జీవితం అత్తింట్లో గడపాలి. రెండు కుటుంబాల సంబంధాలనూ అల్లేవాడు అల్లుడైతే, కులానికి కీర్తి తెచ్చేది కోడలు. పుట్టిల్లు పెళ్లిదాకనే. ఆ తర్వాత చీరలు, సారెలకు పరిమితమైతే, జీవిత సారమంతా వడబోసి మీదు కట్టేది అత్తింట్లోనే. కష్టసుఖాలు, కీర్తి అపకీర్తులు, అనుబంధాలు; ఆఖరుకి మట్టిలో కలిసినప్పుడు నీళ్లు చల్లుకొనేది కూడా అత్తింట్లోనే. అట్లాంటి అత్తింటి అనుబంధం రోజు రోజుకూ బలహీనమై ఆఖరుకు అదృశ్యమయ్యే పరిస్థితి వచ్చింది.



ఆలోచనతో నిద్రపట్టక ఆరుబయట పడక్కుర్చీలో మేనువాల్చి ఆకాశంలో చుక్కలు లెక్కపెడుతున్న రామచంద్రయ్యకు పక్కనున్న పడక గదిలో మాటలు స్పష్టంగా వినపడుతున్నాయి. "నీకేమయిందే? వండిపెడితే తిని లక్షణంగా ఉండక" రమణ గొంతు. "తిండే కాదండీ ముఖ్యం. అంతకంటే ముఖ్యమైనవి చాలా ఉంటాయి" రాధ జవాబు.

"నీకంతకంటే మించిన లక్ష్యాలేముంటాయబ్బా" రమణ వ్యంగ్యం.





"నీవేదో వివేకానందుడవైనట్లు, మేమంతా సామాన్యులమైనట్లు అట్లా మాట్లాడితేనే నాకు వళ్లుమండేది".

"కాదులే, నీవు శారదాదేవివైనట్లు, నేను రామకృష్ణ పరమహంసనైనట్లు నీ పాదపూజ చేస్తే నీ వళ్లు చల్లబడతదనుకుంటా".

"వేరుకాపురం పెడితే నిత్యం నేనే నీ పాద పూజ చేస్తా. ఎక్కడ ఉండేవాళ్లు అక్కడ ఉంటే హాయి. మీవాళ్ల [illegible] [illegible] వస్తున్నా" ఆ తర్వాత మాటలు వినిపించలేదు.

ఉత్తమురాలైన అత్తగా లోకానికి ఆదర్శంగా ఉండాలన్న భార్య తాపత్రయం రామచంద్రయ్యకు గుర్తుకొచ్చింది. అత్తాకోడళ్ల ఆలోచనలలో ఎంత తేడా! వీళ్లిద్దరి మధ్య రమణ మనసు నలిగిపోతుంది. ఒకే ఊరిలో ఉండి వేరువేరుగా ఉండాలంటే వాడి అంతరాత్మ అంగీకరించడంలేదు. తల్లిదండ్రులతో మమైక్యమైన ఆత్మీయ బంధాన్ని తెంచుకొని పక్కకు పోలేడు. భార్యేమో వేరుపోదామనే పోరు రోజు రోజుకు తీవ్రం చేస్తుంది. కన్నీటితో వాడి గుండె కరిగించాలని చూస్తుంది. వాడు మాత్రం ఏం చేస్తాడు పాపం!

అత్తాకోడళ్ల మనసులు కలపడానికి అనునిత్యం ప్రయత్నిస్తూనే ఉన్నాడు రామచంద్రయ్య. కోడలి ప్రవర్తనతో మనసు గాయపడినప్పుడల్లా మాటల నేర్పుతో మందు వేస్తూనే ఉన్నాడు. ఎంత పిలిచినా పలకదు, పట్టించుకోదు - అని కళ్లు తుడుచుకుంటున్న భార్యతో "మన కోడలు చాలా మేలే. ఆ రంగనాథం కోడలైతే గర్భిణీగా ఉన్నప్పుడు అత్తచేత కాళ్లు ఒత్తించుకొనేదట. మన కోడలు కాళ్లు వత్తమనడం లేదు. ఎంత మంచిదో చూడు".

"అత్త కాళ్లు కోడలు వత్తే కాలం పోయి, కోడలు కాళ్లు అత్త వత్తే కాలం వచ్చిందేమోవండి" అంటూ కాల మార్పును గమనించి మనస్సుని సమాధానపరుచుకొంది.

రాధకు ఏ పనీ చెప్పేది కాదు. చెప్పినా రాధ శ్రద్ధగా చేసేదికాదు. వంట పని, ఇంటిపని అంతా ఆమే చేసుకొనేది. అయినా రాధకు వారి గాలి ఎంతమాత్రం పడేది కాదు. పంజరంలో చిలుకలా, జైలుగదిలో ఉగ్రవాదిలా అశాంతితో ఉడికిపోయేది. ఆప్యాయంగా పిలిచినా పలికేది కాదు. పలికినా మనసును కెలికినట్లుండేది. వానరాకడ, ప్రాణం పోకడ తెలియనట్లు, ఆమె మూతి ఎప్పుడు ముడుచుకుంటుందో, మొఖం ఎప్పుడు విచ్చుకుంటుందో తెలిసేది కాదు. ఏదైనా శుభకార్యం పెట్టుకున్నా పాముతో భజన చేసినట్టే. బతిమాలో, బామాలో ప్రసన్నం చేసుకుంటూ, పరువు పోకుండా నెట్టుకు రావల్సిందే.

ఒక రోజు అర్ధరాత్రి రమణ బయటకు వచ్చి పడుకున్నాడు. "ఏంది నాయనా" అంటే,

"రూమ్‌లో గాలి ఆడక నిద్రపట్టలేదులే నాన్నా" అన్నాడు. గాలి ఆడకపోవడానికి కారణం రామచంద్రయ్యకు తెలుసు. అందుకే స్థబ్ధంగా ఉండి పోయాడు.

మరుసటి రోజు ఏకాంతంగా కొడుకును పిలిచి తల్లిదండ్రులిద్దరూ "ఎందుకురా నువ్వు బాధపడేది? అమ్మాయి చెప్పినట్లు వేరుగానే ఉండండి. మాకు చేసుకొని తినే శక్తి ఉంది. ప్రభుత్వం యిచ్చే పెన్షన్ ఉంది. మీకు కూడా మేము చేసిపెడ్తామంటే ఉండడానికి ఆమెకు యిష్టం లేనప్పుడు, కష్టమైనా వేరుగా ఉండడం ఆమె కోరికైతే అట్లాగే ఉండండి. నీవు మా గురించి అనవసరంగా ఎందుకు బాధపడతావు? ఈమే కాదు... ఈనాడు చాలామంది పెళ్లి కాగానే భర్తతోపాటు బయటకు వెళ్లి హాయిగా ఉండడానికి అలవాటు పడుతున్నారు. మేము ఎంత అభిమానించి ఆత్మీయత పంచినా ఆమె మమ్ములను అనుమానంగా చూస్తుంది. దూరంగా నెట్టివేస్తుంది. మా కోసం నీవు ఆమెను దూరంగా నెడితే ఆమెకు అండ ఎవరు? ఆశ్రయమేది? ఆదరణ కరువైతే ఆమె మనసు ఎంత బాధపడుతుందో ఆలోచించావా? ఎవరున్నా, లేకున్నా నీవు భర్తగా ఆమెకు తోడునీడగా ఉండక తప్పదు" వాళ్లు చెప్తూనే ఉన్నారు కాని అవి రమణ చెవిలో దూరడంలేదని తెలుస్తూనే ఉంది.

మరో రెండు రోజుల తర్వాత రాత్రంతా నిద్రలేనట్లు రాధ ముఖమంతా వాడిపోయి కన్పించింది. ఏదో ఆలోచిస్తున్న రాధకెదురుగా రామచంద్రయ్య కూర్చొని "అమ్మా రాధా" అంటూ ఆప్యాయంగా పిలిచాడు. "ఏం మామయ్యా" అంటూ చూచింది.

"ఎందుకమ్మా అంత బాధపడుతున్నావు? మా కోడలిగా నీ వెప్పుడూ కన్నీళ్లు పెట్టకూడదు. అది మనకు క్షేమం కూడా కాదు. అందరం కలిసుంటే ఆనందంగా ఉంటుందని, అనుబంధం పెరుగుతుందని నీకు నచ్చజెప్పి ఉమ్మడి కాపురం పెట్టాం కాని, నిన్ను కష్టపెట్టాలని కాదు. నీకు ఇష్టం లేకపోతే వేరే యిల్లు చూసి ఒక శుభముహూర్తాన మిమ్ములను చేర్చివస్తాము. మీరు ఎక్కడ ఉన్నా సుఖంగా, అన్యోన్యంగా ఉండాలనేదే మా కోరిక."

- మీదే ఆలస్యమన్నట్లు నేల చూపులు చూస్తున్న రాధ భావం రామచంద్రయ్యకు అర్థమైంది.

- వేరే ఇల్లు చూచి ఒక మంచిరోజున గృహప్రవేశం చేయించి వచ్చారు. తమ శరీరంలోని ఒక ముఖ్యమైన భాగాన్ని అక్కడ వదిలిపెట్టి వచ్చినట్లుగా అన్పించింది. అనురాగ బంధం తెంచుకోవడం మాటలు చెప్పినంత తేలికగాదని బోధపడింది.

ఉద్యోగరీత్యా వేరే ఊళ్లో ఉన్నప్పుడు రాధ "అత్తయ్యా! మీరిద్దరూ రండి. అందరం ఇక్కడే ఉందాం" అంటూ పదే పదే ఫోను చేసేది. మా కోడలు ఎంత మంచిది! అత్తామామలు అంటే ఎంత అభిమానం – అని మురిసిపోయి చుట్టుపక్కల వాళ్లకు తమ అదృష్టాన్ని గురించి కథలు కథలుగా చెప్పేవాళ్లు . కాని దగ్గరకు వచ్చిన తర్వాత తెలిసింది, అవన్నీ గాలిమేడలని, పగటికలలని. ఆమె ఆలోచనలు చూస్తే – అంతా ఆమె మాటే జరగాలని, ఆమెకు ఎవరూ ఏమీ చెప్పడానికి లేదని, వేరుకాపురం యిష్టమని – అర్థమయింది.

ఈ మొండి పట్టుదల వల్ల తాము దూరమైనా ఫర్వాలేదు, భర్తను కూడ దూరం చేసుకుంటుందేమోనని, అలా చేస్తే తమ త్యాగం కూడా నిరుపయోగమవుతుందని రామచంద్రయ్య ఆలోచనలో పడ్డాడు. ఒకసారి వియ్యంకుడు

కనపడితే చూచాయగా అన్నాడు "చచ్చిన తరువాత నీవెంట ఏదీ రాదని వేదాంతులు చెప్పేవారు. బతికున్నప్పుడు కూడా మీ వెంట ఎవరూ రారని మా కోడలు తేల్చేసింది" అని.

ఆయన నవ్వి వెళ్లిపోయాడు. రామచంద్రయ్యకు తెలుసు ఆయన ఏమీ చెప్పలేదని, చెప్పినా వినదని. తానే స్వయంగా రంగంలోకి దిగి తగిన సూచన చెయ్యక తప్పదని భావించి, ఒక రోజు పనిగట్టుకొని రాధ దగ్గరకు వెళ్లాడు.

"చూడమ్మా రాధా! కన్న కూతురిలాగ చూసుకుంటున్నా, మా నుండి పట్టుబట్టి వేరు పడ్డావు".

"అదేంటి మామయ్యా! అందరూ వేరుగానే ఉంటున్నారుగా. నేనేదో కొత్తగా చేసినట్లు విచిత్రంగా అంటున్నారేమిటి?" అంది.

"నిజమేనమ్మా! అందరూ చేసిందే నీవూ చేసావు. ఆ ఆచారాన్నే పాటించావు. కానీ అందరం కలిసుండి లోకానికి ఆదర్శంగా ఉండాలని మేము ఆశించాం. మా ఆశ అత్యాశ అని తేలింది. గతాన్ని తొవ్వి తప్పుఒప్పులు తేల్చాలని రాలేదు. నీ భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని ముఖ్యంగా మూడు విషయాలు చెప్పాలని వచ్చాను.

నీ మాట నెగ్గాలని మాకు నరకం చూపించి, వాడిని చిత్రహింసలు పెట్టావు. మీ దాంపత్యం సుఖంగా ఉండాలని మేము కూడా నీకే సహకరించి, వాడిని నీకు అప్పగించి మేము పక్కకు తప్పుకున్నాం. మమ్ములను దూరం చేసుకున్నా ఫర్వాలేదు. మాట పట్టింపులకుపోయి నీ భర్తను దూరం చేసుకోకు. నీకు తెలుసు, వాడి మనసు మంచులాగ స్వచ్ఛమైంది. పువ్వులాగ మెత్తనైంది. అద్దంలాగ సున్నితమైంది. దాన్ని పగులగొట్టుకుంటే అతికించడం ఎవరివల్లా కాదు.

దేవుడి రాతి విగ్రహాలను నిత్యం పూజిస్తున్నావు; ప్రదక్షిణాలు చేస్తున్నావు. కాని తోటి మనిషిని ద్వేషిస్తున్నావు. నిన్ను అభిమానించే వాళ్లను దూరం చేసుకుంటున్నావు. మనిషిలోని మంచిని గుర్తించగలిగితే అందరు దేవుళ్లనూ పూజించినట్లే, అందరు దేవుళ్లనూ దర్శించినట్లే.

నీవు కావాలని మాకు దూరం అయ్యావు కనుక మా భారం మోయడం నీకు యిష్టం లేదని తెలుస్తోంది. కాని అవసరమైతే నీ భారం మోయడానికి మేమెప్పుడూ సిద్ధంగా ఉంటాం. నీ మీద మాకెలాంటి ద్వేషం కాని, కోపంగాని లేవు. మీ దాంపత్యం సుఖసంతోషాలతో చిరకాలం ఆనందంగా ఉండాలనేది మా కోరిక.

రాధ బొమ్మలా వింటూ ఉండిపోయింది. రామచంద్రయ్య తన మానసిక వేదనను రాధ ముందు కుమ్మరించి, వర్షించిన మేఘంలా తేలికై తిరిగి వెళ్లిపోయాడు.

ఒక రోజు రమణని పిలిచి ఏ నిమిషం ఎట్లా ఉంటుందోనని ఆస్తిపాస్తులన్నీ అప్పచెప్పాడు.

"ముసలితనంలో మనకు దిక్కేది" అంది భార్య దీనంగా.

"దిక్కులేని వారికి దేవుడే దిక్కు" అన్నాడు రామచంద్రయ్య దృఢంగా. ఆ తర్వాత రామచంద్రయ్య దంపతులు ఎక్కడికెళ్లారో ఎవరికీ తెలియదు.

రాధకు చీకటి నుండి వెలుగులోకి, ఇరుకు గది నుండి విశాలమైన వీధిలోకి వచ్చినట్లు అన్పించింది. మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించిన యోధునిలా, గీత దాటని భర్తగా రమణను తీర్చిదిద్దడంలో నిమగ్నమైంది. కాని


రమణ మాత్రం నిరాసక్తంగా, నిర్లిప్తంగా మారిపోయాడు. ఏదో ఒక పని కల్పించుకొని సాధ్యమైనంత కాలం ఇంటికి దూరంగా ఉండేవాడు. అవసరమైనవి తెచ్చియిచ్చేవాడు, అంటీముట్టనట్లుగా ఉండేవాడు. సత్రం భోజనం, మఠం నిద్రలా అయింది జీవితం. స్వేచ్ఛాజీవితంలోని మాధుర్యంతో నిస్తేజమవుతున్న భర్త హృదయంలో చైతన్యాన్ని నింపాలని రాధ చేసే ప్రయత్నాలేవీ ఫలించడం లేదు. కీకారణ్యంలో దారి తప్పిన బాటసారిలా, గమ్యం మరచిన పథికుడిలా అనాసక్తంగా, అడ్డదిడ్డంగా తిరుగుతున్న రమణని చూసి రాధ మనసులో తుఫాను మొదలైంది. ఆస్పత్రుల చుట్టూ తిప్పింది. ఎందరో చెప్పిన చిట్కాలు, సలహాలు అమల్లోపెట్టి చూసింది. కాని ఫలితం శూన్యం. అమృత మూర్తుల్లాంటి అత్తమామలకు కల్గించిన ఆత్మక్షోభ తనను పట్టి పీడిస్తోందని రాధ మొట్టమొదటిసారిగా చింతించింది. సున్నితమైన అద్దంలాంటి మనసుని ముక్కలు చెయ్యొద్దని మామయ్య చెప్పిన మాటలు మననం చేసుకొని కన్నీరు కార్చింది. అత్తకు మనసులోనే క్షమాపణలు చెప్పుకొంది.

రాఘవయ్య మాష్టారు ఒక ఆశ్రమం అడ్రసు చెప్పి, అక్కడ నిద్రచేస్తే నయం కాని జబ్బు ఉండదని చెప్పారు. ఆఖరు ప్రయత్నంగా ఆ ఆశ్రమంలో నిద్రచేయడానికి బయలుదేరింది రాధ, రమణను తీసుకొని. ప్రయాణంలో ఆ ఊరిని గురించి ఎన్నో ఊహించని విషయాలు, ఊహకందని నిజాలు విని, ఇట్లాంటి ఊరు కూడ ఉంటుందా అని అనుకుంది. ఆ ఊరిలో పాడిపంటలకు, సిరిసంపదలకు లోటు లేదు. తాగుడు లేదు, తగాదాలు లేవు. ఊరు ఊరంతా ఒకటే మాట, ఒకటే బాట. ఉచితంగా వచ్చేది ఏదీ వారు తీసుకోరు. చెమటోడ్చి సంపాయించుకున్నదే తమ సొంతం. కోర్టులు, పోలీసులు, ఓట్లకు నోట్లు ఆ ఊరి పొలిమేరల్లోకి కూడా రావు. అందరికీ ఆశ్రమమే మార్గదర్శి. ఆశ్రమం దర్శించిన వారికి ఆవేదనలే ఉండవు.

ఆశ్రమంలో అడుగు పెట్టేసరికి చల్లగాలికి తలలూపుతున్న చెట్లు చేతులుచాపి స్వాగతం చెప్పినట్లుగా అన్పించింది. పది, పన్నెండు సంవత్సరాల పిల్లలు చకచకా ఎవరి పని వారు చేసుకుపోతున్నారు. ప్రశాంత నిశాంత నిశ్శబ్దంలో ఆగి ఆగి వినపడుతున్న పక్షుల కిలకిల రాగాలు అంతేవాసులు వల్లిస్తున్న వేదమంత్రాల్లా ఉన్నాయి. ఇద్దరు పిల్లలు దగ్గరకు వచ్చి 'అమ్మగారి దగ్గరికా' అని తీసికెళ్లారు. తాటాకులు కప్పిన చిన్నపాక పరిశుభ్రంగా, నిరాడంబరంగా, నిశ్శబ్దంగా ఉంది. చాపమీద కూర్చుని ఒక వృద్ధ మహిళ చేతిలో తావళం తిప్పుతూ ఎదురుగా ఉన్న సమాధి వైపు దీక్షగా చూస్తోంది. వారిద్దరూ క్షణకాలం సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు.

'అమ్మా' అంటూ రమణ ఆమె ఒడిలో వాలిపోయాడు. రాధ ముఖం చెమట బిందువులతో తడిసిపోయింది. అనుకోని ఈ సంఘటనకు అప్రతిభురాలైన ఆమె తన ఒడిలోని రమణ తల నిమిరి, రాధను కూర్చోమని చాప చూపింది. సందిగ్ధాన్ని వదిలించుకొని 'అత్తయ్యా' అంటూ ఆమె కాళ్ల మీద పడింది రాధ. రమణ మనసులో ఘనీభవించిన వేదనంతా కరిగి కన్నీటి రూపంలో ప్రవహిస్తోంది.

వారు ప్రశాంత చిత్తంతో స్థిరంగా కూర్చున్న తర్వాత సందేహ నివృత్తి చేస్తూ ఆమె "మంచి సమాజం నిర్మించాలన్న మీ నాన్నగారి కల ఈ గ్రామానికి వచ్చి నెరవేర్చుకొన్నారు. ఆయన బ్రహ్మైక్యం పొందినా ఈ జనం హృదయంలో జ్యోతిలా నిలబడిపోయారు. ఎందరో ఇక్కడికి వచ్చి, మానసిక ప్రశాంతి పొంది వెళ్తున్నారు. మమ్ములను మీకు మాత్రమే పరిమితం చేయకుండా, విశ్వమానవులుగా తీర్చిదిద్దిన ఘనత




రాధదే" అంది.

"అంత మాటనకండి అత్తయ్యా! అది ఘనతకాదు, హీనత. అతిహీనంగా ప్రవర్తించి మిమ్మల్ని క్షోభపెట్టినందుకు నేను చెల్లించిన మూల్యం తక్కువేమీకాదు. అయినా మామయ్య మరణవార్త కూడా మాకు తెలుపలేదంటే మిమ్మల్ని ఎంత దూరం చేసుకున్నానో నా కర్థమవుతోంది" అంది రాధ.

అదేమీ లేదమ్మా – "దుఃఖాన్ని నీవే భరించు; సంతోషాన్ని అందరికీ పంచు. నా మరణ వార్త తెలియజేసి దుఃఖాన్ని ఎవరికీ పంచకు" ఇది మీ మామయ్యగారి ఆఖరు కోరిక.

ఆ రాత్రి అక్కడే నిద్రచేసి ఉదయం లేచేసరికి రమణ మానసిక వేదన చేతితో తీసేసినట్టు పోయింది. రాధ ముఖం ఆనందంతో వెలిగిపోతోంది. అమ్మను తీసుకుపోవాలనే వారి ప్రయత్నం చూసి అక్కడికి చేరిన ఊరి వారందరూ ముక్తకంఠంతో చెప్పారు "ఆమె మీకు మాత్రమే కాదు... మాకూ అమ్మే. నాన్నగారు ఈ ఊరిని తీర్చిదిద్ది అమ్మకు అప్పజెప్పి వెళ్లారు. ఇక్కడి వారందరూ ఆమె నీడలో తమ జీవితాలను తీర్చిదిద్దుకుంటున్నారు. ఎంతోమంది ఇక్కడకు వచ్చి సేదతీరి వెళ్తున్నారు. ఇంతమందిని అనాథలుగా చేసి మీరు అమ్మను తీసికెళ్లడం న్యాయమేమో ఆలోచించండి" అన్నారు.

అమ్మపట్ల వారుచూపే ఆప్యాయతకు భార్యాభర్తల కళ్లు చెమ్మగిల్లాయి. ఇంతకాలం తాము కోల్పోయిందేమిటో వారికి అర్థమైంది. "ఈ అమృత హృదయాల ఆదరణ పొందిన మీరు నిజంగా అదృష్టవంతులు. ఆ అదృష్టంలో పాలుపంచుకోవడానికి మేమే ఇక్కడికి వస్తాం. మాకు అనుమతి ఇవ్వమని అమ్మగారిని, మిమ్మల్నీ వేడుకుంటున్నాం" అన్నారు రాధ, రమణలు.

అనుమతి అనుగ్రహించినట్లు ఆశ్రమం గుడిగంట ముమ్మారు మ్రోగింది. ●